

# ఎండమావి

**వాసన్**

“ఎంతసేపూ ఆ వాకిట్లో ఏం పనే? లోపలికి రా?!” అంటూ అరిచింది జానకి తల్లి. ఏ సమాధానమూ చెప్పకుండా అయిష్టంగానే లోపలికి నడిచింది జానకి.

రోడ్డుమీద హడావుడిగా ఉంది. ఎవరిదో బాగావున్నవాళ్ల పిల్ల పెళ్ళి. సందుచివరి కళ్యాణమంటపంలో జరగబోతున్నట్లుంది ఆ రాత్రికి.

ఆ రోజు ఉదయాన్నే సందడి మొదలైంది. వీధి పొడుగునా రెండు వైపులా వెదురు బొంగులు నాటి రంగుల లైట్లు తోరణాలుగా కట్టడం సగానికి విరిచిన అరటిబోదెలు నాటడం, బండ్లమీద తీసికెళ్ళే కుర్చీలు, బల్లలూ వంట పాత్రలూ... అంతా హడావుడిగా ఉంది ఆ వేళ.

ప్రొద్దుట్నుంచీ– ఇంట్లో ఏ పని చేస్తున్నా కూడా జానకి కళ్ళూ చెవులూ వీధివైపే మొగ్గుతున్నాయి.

‘ప్చ్! దేనికైనా పెట్టిపుట్టాలి. అంతటి భాగ్యం ఈ జన్మలో కలుగుతుందా? ఆ పిల్లెవరో అదృష్టవంతురాలు. ఎంత ఘనంగా జరుగుతోంది పెళ్ళి. నా లాంటి మధ్యతరగతి ఆడపిల్లలు కనీసం కలలో కూడా ఊహించలేమేమో’ అనుకుంటూ పెదవి విరిచింది జానకి.

“బియ్యం చెరిగేది అలానా? ఏ ధ్యాసలో ఉన్నావే??” అన్న తల్లి అరుపుకి ఆలోచనలోంచి బయటపడి.

“ఏం లేదులే...” అంటూ నేలమీద వొలికిన బియ్యాన్ని చేటలో పోసింది.

“అదక్కడ పెట్టి మువ్వెళ్ళు తల్లీ. నే చేసుకుంటాలే. వెళ్ళి నాలుగు చేదల నీళ్ళు బావిదగ్గర పెట్టిరామ్మా. మళ్ళీ నాన్నొస్తారు. అప్పుడే మధ్యాహ్నం అయింది. ఏం చేసుకొస్తారో? అయినా చూసి వెళ్ళిన వాళ్ళు ఒక్క ఉత్తరంముక్క రాసిపడేస్తే ఏంపోతుందా? అవుననీ చెప్పరు. కాదనీ చెప్పరు. అంతేలే. వాళ్ళదేగా పైచేయి. మన తలరాత బాగుండి.... ఈ సంబంధమన్నా కుదిరితే...” అంటూ నిట్టూర్చింది జానకి తల్లి.

జానకి పెరట్లోకి వచ్చి బావిలోంచి నీళ్ళు తోడి బక్కెట్‌తో పోస్తూ ఉంది. బావిగట్టు మీద రెండు ఉడుతలు సరసాలు ఆడుకుంటున్నాయి.

చప్పున పోయిన నెలలో వచ్చి చూసిన పెళ్ళివారు గుర్తొచ్చారు.

వామనఛాయలో, బలహీనంగా, పొగచూరినట్లున్న నల్లటి పెదాలతో... ఊహూ, ఏమీ బాగోలేదు పెళ్ళి కొడుకు.

ఈ విధంగా పెళ్ళి చూపులు ఏ ఇరవైయ్యోసారో. అందరూ వచ్చి చూసి పెట్టింది తిని, నానా అడ్డమైన ప్రశ్నలూ వేసి, ఉత్తరంరాస్తామనో, కబురు వేస్తామనో చెప్పి వెళ్ళి... పిల్ల నచ్చలేదనో, ఇంకో అయిదువేలో... ఇంకాస్త కావాలనో, లేకపోతే లాంఛనాలు చాలవనో చెప్పి కప్పదాటు వేసినవాళ్ళే. అయినా నాన్న మాత్రం ఎన్నవి వెతకగలడు. నాకా అప్పుడే పాతికేళ్ళు నిండాయి. ఇంక సంబంధాలు వచ్చినా, మొన్న వచ్చిన లాంటివో, లేకపోతే ముప్పై అయిదు నలభై దాటిన ముదురు బెండకాయలో, ఒకరిద్దరు పిల్లలున్న రెండో పెళ్ళివాళ్ళో... ఇంతేగా?

ఇలాంటి కుటుంబాల్లో ఆఖరి ఆడపిల్లగా పుట్టకూడదు. ముందు వాళ్ళకి ఎలాగో ఒకలాగా పెళ్ళిళ్ళు చేసి బయటికి పంపాక. ఇంక చివరిదానికి ఎలాగైనా పెళ్ళి చేసిపంపాలని చూసినా, ఏ దారీ కనిపించదు.

అక్కయ్యలకి మాత్రం ఏమంత గొప్ప సంబంధాలు వచ్చాయని. ఒక మోస్తరువేగా. తిట్లు తింటున్నా, తన్నులు తిన్నా, అంట్లగిన్నెల మధ్య, పొదిపనుల్లో మునిగిపోయివున్న అక్కయ్యలిద్దరూ... వాళ్ళ జీవితాల్లో వాళ్ళు కాస్తంత సుఖంగానే జీవిస్తున్నారేమో?

ఏమో? మరి నా సంగతో? తలరాత ఎలా రాసివుందో?

జానకి ఆలోచనల్ని తెంచుతూ,

“ఎంత సేపు నీళ్ళు తోడేది? ఏం ఆలోచనే తల్లీ. ఈ రోజు నీకేమైంది?” అంటూ కేకపెట్టింది తల్లి.

అప్పటికే నిండిపోయి పొర్లుతున్న బక్కెట్‌ని పక్కన పెట్టి లోపలికి నడిచింది జానకి.

“నాన్న ఎప్పుడొస్తారో? అన్నం తినకూడదూ. పొద్దెక్కింది”

“నా కాకలిగాలేదు. నువ్వు పెట్టుకు తిను.”

“రోజూ పెందరాళే తినేదానివికదా. ఈ రోజు ఏ మొచ్చింది ఏమో నీ ఇష్టం. చెప్పినా వినేవాళ్ళకి చెబుతాంకానీ...” చిన్నగా సణుగుతూ వంటింట్లోకి వెళ్ళింది జానకి తల్లి.

జానకి బయట గదిలోకి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడి రోడ్డుమీదకి చూసింది.

ఎండ నిప్పులు చెరుగుతోంది. మార్చి నెల గాలి విసురుగా వీస్తోంది. వీధి నిర్మానుష్యంగా ఉంది.

దూరంగా సందు చివర కల్యాణ మండపందగ్గర మాత్రం మనుషులు సందడిగా తిరుగుతున్నారు. పట్టుచీరలు, పచ్చల హారాలు ఎండలో మరింతగా మెరుస్తున్నాయి. వెళ్ళే కార్లు, వచ్చే కార్లు.

కిటికీ చువ్వలు పట్టుకుని అలానే చూస్తుండిపోయింది జానకి.

వారంరోజుల నుంచి రోజూ ఇదే సమయానికి ఇంటి ముందు నుంచి వెళ్ళే జీన్స్ పాంట్ కుర్రాడు సైకిల్ మీద చిన్నగా వెడుతూ రోజూ లాగే జానకిని చూస్తూ కొంటెగా నవ్వాడు.

జానకి కూడా బదులుగా నవ్విందో లేదో? ఆమెకే తెలీలేదు. చప్పున ఆమె మనసులో ఆ కుర్రాడితో ఎక్కడికైనా దూరంగా లేచివెళ్ళిపోతేనో? అనే ఆలోచన కలిగింది.

మరుక్షణమే అమ్మ నాన్న గుర్తొచ్చారు.

కేవలం ఆ ఆలోచన కలిగినందుకే ఆమె మీద ఆమెకే అసహ్యంకలిగింది. ఉన్నట్టుండి దూరం నుంచి ఏదో పక్షి అరుపు గాలిలో తేలుతూ వినిపించింది.

ఆ మధ్యాహ్నం,

ఒంటరిగా నిలబడి, కిటికీలోంచి కనబడే నీలాకాశాన్ని, కదుల్తున్న తెల్లటి మబ్బుతునకని చూస్తున్న జానిక్కి ఎందుకో కారణం లేకుండా దిగులు కలిగింది.

గుండెలో– బరువుగా, భారంగా, ఏదో తెలీని, ఎప్పటి యవ్వనపు మొదటి రోజుల్లోనో చేజార్చుకున్న అవకాశమో, మాసిపోతున్న జ్ఞాపకమో చిన్నగా కదిలినట్లుగా అనిపించింది.

ఎవరిదో అస్పష్టమైన రూపం... కళ్ళ ముందు తెరలాగా కదిలినట్లయింది. ఆర్థిక పరమైన అంతరాలు, బలహీనతలు, అవసరాలు, పరిస్థితులు అమాంతం వేరుచేసిన ఎప్పటికీ కలవకుండా విడిపోయిన రెండుదారులు, జీవితాలు కళ్ళముందు మెదిలాయి.

ప్చ్! జీవితమంటేనే రాజీపడటం. అప్పుడూ... ఇప్పుడూ... ఎప్పుడూ...

‘నాన్నెప్పుడొస్తారో’ అనుకుని నిట్టూర్చింది జానకి.

కిందటి నెలలో చూసి వెళ్ళిన వాళ్ళకి నేను నచ్చితే... నాన్నకి ఇంక ఏ బరువూ, బాధ్యత ఉండవు. ఆయన స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోవచ్చు. అమ్మ, నాన్న ప్రశాంతంగా జీవితాన్ని గడిపేయచ్చు.

నా జీవితమా? అందరు స్త్రీలూ– తాము కోరుకున్న, తమకి నచ్చిన వాళ్ళతోనే జీవిస్తున్నారా? ఎంతమందికి తమకి తగిన వాళ్ళతో పెళ్ళిళ్ళు అయ్యాయని? సర్దుకుపోయి, రాజీపడిపోయి, గానుగెద్దుల్లాగా బతకడంలేదా?

నాకు మాత్రం అంతకన్నా ఉన్నతమైన జీవితం లభిస్తుందనుకోను. మొన్న చూసి వెళ్ళిన పెళ్ళికొడుకు జానక్కి మళ్ళీ గుర్తొచ్చాడు.

గొప్ప అందగాడు కాదు. అయినా, మగాళ్ళకి అందమేంటి? వేళపట్టున తిండి తిప్పలులేక అలా ఉన్నాడేమో. సరైన పోషణ ఉంటే బాగానే ఉంటాడు.

అతను నా పక్కన ఎలా ఉంటాడో? ఈడుజోడు బాగుంటామా? అతని పక్కన తనని ఊహించుకుంది జానకి.

‘ఛీ పాడు’ ఇంకా కుదిరి పోకుండానే– ఈ ఆలోచనేంటి– అనుకుంది.

కానీ, ప్రతిసారీ ఇదే తంతుగా వచ్చి చూసిన ప్రతి యువకుడూ తప్పక భర్త అవుతాడనే కలలు కంటుంది స్త్రీ హృదయం. ఆశపడుతుంది. ఏ నూటికో ఒకటి ఫలిస్తుంది. మిగతావన్నీ అంతేగా?

సాయంత్రం అయింది.

ఎప్పుడు ఫోం చేసిందో జానక్కి తెలీలేదు.

ఆమె ధ్యాసంతా కళ్యాణమండపందగ్గర చిక్కుకుపోయింది.

“ఇంతవరకూ రాలేదేమే మీ నాన్న. ఖాయం చేసుకుని ఉంటారు. బలవంతాన ఫోం చేసి వెళ్ళమంటే– ఉండిపోయి చిన్నగా బయల్దేరలేదుకదా! ఆలస్యం అయింది కాబట్టి శుభవార్త తెస్తార్లే.... ఆనందపడింది జానకి తల్లి.

తల్లి మాటలకి ఎందుకనో, జానకి శరీరం క్షణం పాటు వొణికి, మెడమీద వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

ఇంతలో బయట బ్యాండుమేళం వినిపించింది.

ఇద్దరూ కదిలి వీధి గుమ్మం వైపు వెళ్ళి చూశారు.

పెద్ద ఊరేగింపు. మధ్యలో పూలతో అలంకరించిన టాపులేని కారులో పెళ్ళికొడుకు. ఔట్లు రాకెట్స్ పేలుస్తున్నారు.

గందరగోళంగా ఉంది.

“అమ్మో ఎంత మంది జనమో?” అనుకుంది జానకి.

ఊరేగింపుకి ఎంత ఖర్చు పెట్టి ఉంటారో? అనుకుంటూ కారులోని పెళ్ళికొడుకుని చూసింది. ఒక మోస్తరుగా బాగానే ఉన్నాడు.

ఆమె అతన్ని చూస్తూ అతని పక్కన కారులో తనని ఊహించుకుంది. అంతటి అదృష్టం, ఇంతవైభవంగా పెళ్ళి జరిగే యోగం తనకున్నాయా? ఏమో? ఏ అద్భుతమో జరిగితే కానీ– అలా కాదేమో...

ఊరేగింపు వెళ్ళిపోయింది.

జానకి మనసంతా తీవ్రమైన అసంతృప్తితో నిండిపోయింది. ఉన్నట్టుండి కోపం వచ్చింది. ఎవరిమీదో చెప్పలేని కసి కలిగింది.

ఏమి చేయలేక ఇంట్లోకి నడిచింది.

చీకటి పడింది.

దీపాలు పెట్టేవేళకి తండ్రి ఉసూరుమంటూ ముఖం వేలాడేసుకుని ఇంట్లోకి వచ్చాడు.

“ఏమండీ... ఇంత ఆలస్యం అయిందేం? కాయా? పండా?” అంటూ ఆశగా అడిగింది జానకి తల్లి.

“ఊ...” అంటూ తలపంకించి ఏ సమాధానమూ చెప్పకుండా పెరట్లోకి వెళ్ళాడు జానకి తండ్రి.

“ఏమిటండీ... మాట్లాడరూ...” అంటూ వెంబడించింది. అలా పెరట్లోకి దారి తీసి, కాళ్ళు కడుక్కుంటున్న భర్త వెనక నిలబడి, “ఏమన్నారు వాళ్ళు. అన్నిటికీ ఒప్పుకున్నారా” అంది.

“ప్చ్...లేదు”

“ఎందుకనీ. కట్నం చాలదటనా? చెప్పకపోయారా? రెండో మూడో ఎక్కువైనా ఇవ్వగలమని. ఎక్కడైనా అప్పుచేద్దామనుకున్నాంగా వాళ్ళు ఎక్కువ అడిగితే...”

“వాళ్ళు అడిగింది మన చేతుల్లో లేని పనే” అన్నాడు భారంగా

“అది ఏంటండీ”

“మన అమ్మాయి... వయసు ఎక్కువట. కనీసం మూడు నాలుగేళ్ళు చిన్నదైనా బాగుండేదట... వాళ్ళకి... వాళ్ళకి పాతికేళ్ళపిల్ల వద్దట...” అన్నాడు బాధగా... జానకి ఎక్కడ వింటుందోనని చిన్నగా...

కానీ వంటింటి తలుపుచాటున ఉన్న జానకికి ఆ మాటలు వినిపించనే వినిపించాయి.

ఆమెకి ఎంకనో ఏడుపొచ్చింది. కానీ కన్నీళ్ళు మాత్రం బయటికి రాలేదు.

ఆ రోజు రాత్రి–

ముందు గదిలో పడుకుని ఉన్న జానకికి దూరం నుంచి మేళాలు వినిపిస్తున్నాయి. మధ్యమధ్య పురోహితుడి మంత్రాలూ అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఆమెలో పొద్దుట్నుంచీ రగులుకుంటున్న కసి, కోపం, నిస్సహాయత, అసూయ అన్నీ ఒక్క పెట్టున విజృంభించి దుఃఖంగా బయటపడ్డాయి.

ఏమీ చేయలేక చాతకాక... నిశ్శబ్దంగా కన్నీళ్ళు కారుస్తూ, తలగడలో ముఖాన్ని కూరుకుంది.

ఆ వసంతకాలపు చీకటి రాత్రి వెచ్చగా ఉంది.

ఆ రాత్రి లోకంలో పెళ్ళికాని కన్నె పిల్లలు కంటున్న అర్థంలేని వ్యర్థమైన కలల్ని, ఆశల్ని, వాళ్ళ కాటుక కళ్ళనించి స్రవించే నల్లటి దుఃఖాశ్రువుల్నీ పీల్చుకుని... మరింత చీకటిగా జీవితాల్ని చుట్టుకుంటూనే ఉంది.